క్లుప్తంగా

నేత్ర వైద్య శిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ రమేష్

గుర్ల: మండలంలోని దమరసింగి గ్రామంలో విజయనగరం స్వామి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధ వారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ రమేష్ శిబిరంలో సుమారు 100 మందికి కంటి పరీక్షలు చేశారు. 30 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు.మిగతా వారికి మందులు అందజే శారు. సర్పంచ్ మీసాల కల్యాణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల ప్రసాద్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

జామి: మండలంలోని విజినిగిరిలో పేదలకు గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. సభ్యులు కె.శ్రీనివాసరావు, సన్యాసినాయుడు, తాతంనాయుడు,రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయిల పరిశీలన



కుళాయిలను పరిశీలిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, ఏఈ దేవి

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను ఎంపీపీ దొగ్గ సత్య వంతుడు బుధవారం పరిశీలించారు. సర్పంచ్ బాలబాబు పంచాయతీ నిధులతో ట్యాంకు నిర్మించి, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయ డంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమయ్యిందన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత



మృతుడు భార్య లక్ష్మికి చెక్కు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ వెంకటేష్

మెరకముడిదాం: మండలంలోని ఎం.రావివలస గ్రామానికి చెందిన కోడి ఆదినారాయణ ఇటీవల మృతిచెందాడు. ఆయనకు ఉత్తరావల్లి గ్రామీణ వికాస్ బ్యాంకులో ఖాతా ఉండడంతో పీఎంజేజేబీవై పథకం ద్వారా బీమా వర్తించింది. మృతుడి భార్య, నామినీ లక్ష్మికి రూ.2లక్షల చెక్కును ఉత్తరావల్లిలోని బ్యాంకులో మేనేజరు బి.వెంకటేష్ బుధవారం అందజేశారు. ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.రఘు, సీఎస్‌పీ ఏ.వేణునాయుడు పాల్గొన్నారు.

గజపతినగరంలో 104 వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలో బుధవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ, వైద్య సిబ్బంది 79 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహ సందర్శన చేసి శిబిరానికి రాలేకపోయిన గర్భిణులు, వృద్ధులకు వైద్య తనిఖీలు చేసి, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు.

8, 9న విద్యార్థులకు పోటీలు

చీపురుపల్లి: ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు స్థానిక జవహర్ బాలభవన్ ఆధ్వర్యంలో ఈనెల 8న సంగీతం, నృత్యం, 9న చిత్రలేఖనం, ఇన్‌స్ట్రుమెంటల్ ప్లేయింగ్ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సూపరింటెండెంట్ డాక్టర్ సుంకరి రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలను వివిధ రాష్ట్రాలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని బాలభవన్ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు ఉంటాయని తెలిపారు. ఒకటో తరగతి నుంచి నాలుగో తరగతి విద్యార్థులను సబ్ జూనియర్స్‌గా, 5వ తరగతి నుంచి 7వ తరగతి వారు జూనియర్స్‌గా, 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న వారిని సీనియర్స్ గా పరిగణించి, వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. వివరాలకు 86397 59964, 80991 41784 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అరకు రోడ్డులో అయోమయ ప్రయాణం



అరకు-విశాఖ రోడ్డులో కొత్తవలస మండలంలోని నిమ్మలపాలెం సమీపంలో మలుపువద్ద తుప్పలు

- విశాఖ- అరకు రహదారిలో తుప్పల మధ్యలో సూచికలు, హెచ్చరిక బోర్డులు
- మైలురాళ్లపై అస్పష్ట రాతలు
- ఎంతదూరం ప్రయాణించామో, ఎక్కడున్నామో తెలియని అయోమయంలో ప్రయాణికులు, పర్యాటకులు
- గ్రామాల సమాచారం తెలిపే బోర్డుల చుట్టూ పెరిగిన తుప్పలు

లక్కవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గం పరిధిలో ఉన్న విశాఖపట్నం-అరకు-అనంతగిరి జాతీయ రహదారిలో సూచిక బోర్డులు కనిపించక, మైలురాళ్లపై రాతలు స్పష్టంగా లేకపోవడంతో కొత్తగా ఈ మార్గంలో అరకు వెళ్లే పర్యాటకులు తికమక చెందుతున్నారు. ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకు అందాలు చూసేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, దేశంలోని పలు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. కార్తీక మాసంతో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ముందుగా విశాఖపట్నం చేరుకొని అక్కడ నుంచి కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలపై అరకు వెళుతుంటారు. అయితే కొత్తవలస మండలంలోని చింతలపాలెం నుంచి ఎల్.కోట మీదుగా ఎస్.కోట మండలంలోని బొడ్డవర గ్రామపరిధి వరకు ఈ జాతీయ రహదారిలో సూచికలు, హెచ్చరిక బోర్డులు, మైలు రాళ్లు, గ్రామాల సమాచారం తెలిపే బోర్డులు ప్రయాణికులు, పర్యాటకులకు కనిపించడం లేదు. దీంతో వారికి ఎంత దూరం ప్రయాణించామో, ఇంకా ఎంతదూరం ప్రయాణించాలో, ఎక్కడున్నామో అన్నసంగతి తెలియడం లేదు. హైవేలో మైలు రాళ్లు ఏర్పాటు చేసి వాటిపై పెయింట్‌తో తెలుగు,ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఊరుపేర్లు, కిలోమీటర్ల వివరాలను పెయింట్‌తో రాయడం తప్పనిసరి. ఈ మార్గంలోనూ ఆ విధంగా మైలు రాళ్లను ఏర్పాటు చేశారు. ఎప్పుడో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన రాళ్లు కావడంతో వాటిలో కొన్ని విరిగిపోయాయి. ఉన్న రాళ్లపై పెయింట్ వెలిసిపోవడంతో రాతలు అస్పష్టంగా, అర్థం కాని విధంగా ఉన్నాయి. ఈ రోడ్డులో ప్రమాదకర మలుపులు కూడా ఎక్కువే. ఈమలుపుల వద్ద తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వీటి వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గ్రామాల సమాచారం తెలిపే బోర్డుల చుట్టూ తుప్పలు ఏపుగా పెరగడంతో అవి ప్రయాణికులకు కనిపించడం లేదు. నేషనల్ హైవే అధికారులు స్పందించి నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో మైలు రాళ్లపై పెయింటింగ్‌లు వేయించాలని, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రోడ్డును ఆనుకుని గ్రామాల సమాచారం తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కొత్తవలస మండలంలోని అప్పన్నపాలెం సమీపంలో అస్పష్ట రాతలతో ఉన్న బోర్డు



ఎల్.కోట మండలంలోని గంగుబూడి సమీపంలో విరిగిపోయిన మైలు రాయి



కొత్తవలస మండల పరిధిలో తుప్పల్లో ఉన్న అడ్డూరువానిపాలెం గ్రామ బోర్డు



కొత్తవలస మండలంలోని అడ్డూరువానిపాలెం వద్ద తుప్పల్లో ఉన్న సూచిక బోర్డులు

పట్టించుకోవడం లేదు..



రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. అయినా నేషనల్ హైవే అధికారులు పట్టించుకోవడం లేదు. జంగిల్ క్లియరెన్స్ చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు, ప్రమాద సూచికలు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలి.

– ద్వారపూడి సత్యారావు, వైస్ సర్పంచ్, సీతారాంపురం, ఎల్.కోట మండలం

పెట్టుబడి సాయం అందించాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న అప్పలరాజు, రైతులు

జామి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తక్షణం పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి డేగల అప్పలరాజు డిమాండ్ చేశారు. మండ లంలోని అలమండ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి సురేంద్రకుమార్‌కు రైతులతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పథకం పేరిట రూ.20,000 అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చాలని అన్నారు. కూట మి అధికారంలోకి వచ్చి ఆరునెలలు కావస్తున్నా, ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా ఇంకా ఒక్క రైతుకూ పెట్టుబడి సాయం అందించలేదని మండిపడ్డారు. జిల్లాలో పెండింగ్‌లో సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తిచేయాలని, అన్ని పంటలకూ బీమా సదుపాయం కల్పించి, ప్రభుత్వమే రైతుల తరఫున ప్రీమియం కట్టాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

బొండపల్లి: అంబటివలస గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీఓ జి.గిరిబాల బుధవారం తనిఖీలు నిర్వహించా రు. రికార్డులతో పాటు, పౌష్టికాహార స్టాక్‌ను పరిశీలించారు. రోజూ సమయానికి కేంద్రం తెరవాలని, గర్భిణులు, బాలింత లకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని, చిన్నారులకు ఆటపాటల తో కూడిన విద్యాబోధన చేయాలని అంగన్ వాడీ కార్యకర్తకు సూచించారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించి, సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి సీహెచ్.సత్యవతి ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

అనుమతి లేకుండా చెట్ల నరికివేత



టేకు చెట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాములమ్మ, రెవెన్యూ సిబ్బంది

వేపాడ: మండలంలోని వెంకయ్యపాలెం గ్రామంలో వివాదస్పద భూమిలో ఉన్న టేకు చెట్లను కొందరు వ్యక్తులు రెవెన్యూ, అటవీ శాఖ అనుమతిలేకుండా నరికివేశారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు తహసీల్దార్ రాములమ్మ, రెవెన్యూ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నెంబర్ 66, 67లలో సుమారు 45 టేకు చెట్లను నరికివేసినట్లు ప్రాథమిక సర్వేలో గుర్తించామని తహసీల్దార్ చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నామని, సమగ్ర సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నామని తెలిపారు. డీటీ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి సర్వేయర్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

క్విజ్, పద్యపఠన పోటీలు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం క్విజ్, పద్య పఠన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేయడంతో పాటు విద్యార్థులందరికీ విద్యాసామగ్రి పంపిణీ చేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.చంద్రశేఖరరావు, బ్యాంకు మేనేజర్ సురేష్, బ్యాంకు అధికారి సత్యారావు, ఉపాధ్యాయులు శంకరరావు, సత్యదేవుళ్లు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ జి.అనసూయ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ సురేష్, తదితరులు

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి

గజపతినగరం: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ బి.కల్యాణి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వీధికాలువ ల్లో పూడిక తీయించడంతో పాటు తరచూ తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయాలని సూచించారు. వాటర్ ట్యాంకులు, తాగునీటి బోర్ల వద్ద మురుగు నీరు నిల్వలేకుండా చూడాలని, కాలువల్లో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని చెప్పారు. డయేరియా, విషజ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి, ఈఓపీఆర్డీ బి.సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్యాణి

జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలి

చీపురుపల్లి: కేంద్ర ప్రభుత్వం ద్వారా పెన్షన్లు పొందుతున్న మాజీ సైనికులు నవంబర్ నెలలోనే జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాల్సి ఉందని మాజీ సైనికుడు కె.మురళీధర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. పెన్షన్లు పొందేందుకు కీలకమైన జీవన ప్రమాణ పత్రాన్ని ట్రెజరీలకు సమర్పించాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి తాను ఉచితంగా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మాజీ సైనికులు తమ జీవన ప్రమాణ పత్రాలు ఆన్‌లైన్ ద్వారా ట్రెజరీలకు సమర్పించేందుకు 94403 96983 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు వేపాడలో నేత్ర వైద్యశిబిరం

వేపాడ: మండల కేంద్రంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నేత్రవైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి జోగారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరంలో ఉదయం 9 గంటల నుంచి శంకర్ ఫౌండే షన్ కంటి ఆస్పత్రి సిబ్బంది నేత్రపరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి, విశాఖలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తర లించి ఉచితంగా శస్త్ర చికిత్స చేయనున్నామని తెలిపారు. నేత్ర సమస్యలతో బాధపడే వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆధార్, రేషన్ కార్డులను తీసుకుని రావాలని సూచించారు.

ఇద్దరిపై కేసు నమోదు

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ దేవి బుధవారం తెలిపారు. వావిలపాడు పంచాయతీ పరిధిలోని ఓ క్వారీ కార్యకలాపాలకు వారం రోజులుగా ఇబ్బందులు కలిగిస్తున్నారని, క్వారీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

రేపటి నుంచి ఆశీర్వాద సభలు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన హోసన్నా షాలోమ్ మందిర్ ఆధ్వర్యంలో ఈనెల 8, 9, 10 తేదీల్లో ఆశీర్వాద, సువార్త, స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు పాస్టర్ ఆర్.జాషువా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆంజనేయపురంలో మూడు రోజులు నిర్వహించే ఈ సభలకు కోయంబత్తూర్‌కు చెందిన హ్యారీగోమ్స్ హాజరై సువార్త అందించనున్నట్లు పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



గరుడుబిల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లికార్జునరావు

బొండపల్లి: వరి సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ పి.వి.మల్లికార్జునరావు అన్నా రు.వేంద్రాం,గరుడుబిల్లి గ్రామాల్లో బుధవారం'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వరి పంటను పరిశీలించి తెగుళ్ల నివారణకు తీసుకోవా ల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ సంతోష్ కుమార్, వీపీఏ అప్పలనాయుడు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం చేయండి



బొండపల్లి: పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

- ఎస్పీ వకుల్ జిందాల్

బొండపల్లి: రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, వారిని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత సచివాలయాల మహిళా పోలీసులు, దత్తత పోలీసులు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. రికార్డు లను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. అనంతరం మహి ళా పోలీసులు, పోలీస్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పోలీసుల పేరు చెప్పి సైబర్ నేరగాళ్లు ఎక్కువగా డిజిటల్ అరెస్టులు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, ఇలాంటి నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రజలతో మర్యాద, స్నేహపూర్వకంగా మెలగాలని, పోలీస్ వ్యవస్థపై ప్రజలకు భరోసా కలిగేలా, నేరాలు తగ్గుముఖం పట్టేలా పని చేయా లని సూచించారు.తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవించే ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని, గ్రామాల్లోని రద్దీ కూడళ్ల వద్ద సీసీ కెమెరా లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్య క్రమాలకు పాల్పడే వారిపై దృష్టి పెట్టాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెట్టాలని చెప్పారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిస కాకుండా, వాటితో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని దిశా నిర్దేశం చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ పి.శ్రీనివాసరావు, గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ,బొండపల్లి,గజపతినగరం ఎస్ఐలు యు.మహేష్,కె.లక్ష్మణరావు ఉన్నారు.



దత్తిరాజేరు: పెదమానాపురం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

పెదమానాపురం పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం సాయంత్రం తనిఖీలు చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, లాకప్ గదులు, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. గరోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలపై ఎస్ఐ జయంతి కి దిశా నిర్దేశం చేశారు. అనంతరం గ్రామానికి చెందిన పదిమంది వద్ద మహిళలకు దుప్పట్లు, చీరలు స్వీట్లు పంపిణీ చేశారు.ఆయన వెంట బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ, స్పెషల్ బ్రాంచ్ సీఐ లీలారావు, గజపతినగరం, బొండపల్లి, ఎస్.బూర్జవలస ఎస్ఐలు ఉన్నారు.

ఆలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, తదితరులు

లక్కవరపుకోట: దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించి అందరికీ అనుకూలమైన ధర్మాచార్యులకు అప్పజెప్పాలని ఆర్‌ఎస్‌ఎస్ ఖండ కార్యవాహ భీశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించాలనే నినాదంతో 2025 జనవరి 5వ తేదీన విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 5లక్షల మందితో హైందవ శంఖారావం నిర్వహించనున్నామని చెప్పారు. దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం ఇతర రంగాల్లో ఖర్చు చేస్తోందని దుయ్యబట్టారు. హైందవ శంఖారావం విజయవంతం చేసేందుకు ముందస్తుగా కొత్తవలస,ఎల్.కోట,వేపాడ మండలాలకు చెందిన గ్రామస్థాయి, వివిధ క్షేత్రాల ప్రముఖులతో ఖండ సమన్వయ కార్యక్రమం ఈనెల11న గోల్డ్‌స్టార్ జంక్షన్‌లోని కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్ఎస్ ఎస్ ఖండ సహ సంయోజక్ ద్వారపూడి సత్యారావు, మోటూరు గోవిందరావు, అల్లు గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

16న సీపీఎం మహాసభ

కొత్తవలస: జిల్లా కేంద్రం విజయనగరంలో ఈనెల 16వ తేదీన మహాసభ నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు మద్దిల రమణ,గాడి అప్పా రావు తెలిపారు. మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలోని సబ్బవరం రోడ్డులో బుధవారం ఆవిష్కరించారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై అనేక రూపాల్లో ఆర్థిక భారాలను మోపి దెబ్బతీస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వాల విధానాలతో రైతన్న కుదేలవుతున్నాడని, పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్లకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ప్రభుత్వం రాయితీల పేరిట కట్టబెడుతోందని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ప్రజలు, కార్మికులు, రైతుల సమస్యలపై మహాసభలో చర్చిస్తామన్నారు. జిల్లా పాల సంఘం కార్యదర్శి జి.కృష్ణమూర్తి, ముఠా కళాసీల యూనియన్ సభ్యులు సూరెడ్డి శ్రీను, జెక్కాన వెంకటరమణ, దావాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

రమణ ఆశయాలను యువత కొనసాగించాలి



సంతాపసభలో మౌనం పాటిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత, ఉపాధ్యాయులు

చీపురుపల్లి: నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలను చైతన్యవంతులను చేస్తూ, ఎంతోమందికి సహాయపడిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షు డు రెడ్డి రమణ ఆశయాలను యువత కొనసాగించాలని పలువురు వక్తలు అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన రమణ సంతా ప సభను యువత, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పట్టణంలోని జి.అగ్రహారంలో బుధవారం నిర్వహించారు. రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువ త, స్థానికులు రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రమణ చేసిన సేవా కార్యక్రమాలపై జనజాగృతి సంస్థ ప్రతినిధులు వి.మోహన్‌రావు, ఎం.సుశీల గేయాన్ని రచించి, పాడి వినిపించారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు నారు సింహాద్రినాయుడు, జాతీయ ఉత్తమ సేవ అవార్డు గ్రహీత పెంకి చైతన్య, ఉత్తమ రక్తదాత అబ్దుల్ రవూఫ్, త్రిబుల్‌ఎస్ రాజు, కోరాడ వేణు, గొర్లె పద్మావతి, ఎం.సుశీల, వి.మోహన్‌రావు, డోల నాగరాజు, మీసాల లక్ష్మణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల వరహాలనాయుడు, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, కూటమి నాయకులు రౌతు కామునాయుడు, ముల్లు రమణ, విజనగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న గోవిందరాజులు

రక్తదానం.. మొక్కల పంపిణీ

రమణ సంతాపసభ సందర్భంగా పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు ఆధ్వర్యంలో రక్తదాన, నేత్ర వైద్య శిబిరం నిర్వహించా రు. 37 మంది యువకులు రక్తదానం చేశారు. అలాగే రమణ జ్ఞాపకార్థం 150 మందికి మొక్కలు పంపిణీ చేశారు.